క్లుప్తంగా

టీయూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

తిర్యాణి: టీయూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం మండల కార్యవర్గాన్ని ఆదివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సదాశివ్, కోశాధికారి వెంకట్రావ్‌లు పేర్కొన్నారు. మండల అధ్యక్షుడిగా బోమ్మెన భరత్ చందర్, గౌరవ అధ్యక్షుడిగా ఆత్రం దేవ్‌షా, ప్రధాన కార్యదర్శిగా కోట్నాక ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా సిడాం శ్రీలత, జాల రజినీకాంత్, సంయుక్త కార్యదర్శులుగా కోట్నాక విజయ్, పెందూర్ గంగారాం, కార్యదర్శులుగా నైతం లావణ్య, నైతం లచ్చు, కోశాధికారిగా ఆత్రం సందీప్‌కుమార్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా నాయకులు గెడం జనార్దన్, ఆత్రం జగ్గారావు తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రవీందర్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లోని చీపురుదుబ్బ ఫీడర్‌లో మరమ్మతులు చేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతో నేడు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు మండలంలోని గురుడుపేట, కన్నెపల్లి, బోదంపల్లి, కనికి, యాపలగూడ గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో దేవతలకు మొక్కులు


పూజలు చేస్తున్న భక్తులు

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా గ్రామ సమీపంలోని గద్దెలపై దేవతలు సమక్క-సారలమ్మలు ఆదివారం కొలువుదీరారు. దేవతలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. నిలువెత్తు బంగారాన్ని సమర్పించడంతో పాటు ఒడి బియ్యం, ముడుపులు సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

అలరించిన కవితాగానం

మంచిర్యాలఅర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఫిబ్రవరి రెండో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కవులు వివిధ ప్రక్రియల్లో తమ కవితాగానం చేశారు. సంస్థ అధ్యక్షుడు వామన్‌రావు, ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, కవులు మలయశ్రీ, పెంచాల శ్రీనివాస్, జగన్‌మోహన్‌రావు, సుజాత, ప్రమీల, విద్యాసాగర్ హాజరయ్యారు.

సరుకులు అందజేత

జన్నారం: ఉపాధి కోసం ఇరాక్ దేశం వెళ్లి అనారోగ్యంతో మృతి చెందిన దేవునిగూడ గ్రామానికి చెందిన వెంకటేశ్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని వీబీపీ రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. వీబీపీ ఆధ్వర్యంలో వెంకటేశ్ కుటుంబ సభ్యులకు బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు. ప్రభుత్వం గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేసి, బడ్జెట్‌లో ప్రత్యేక నిధి కేటాయించి, రోడ్డున పడ్డ గల్ఫ్ కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, రవీందర్, మల్లేశ్, వెంకటచారి, దుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సంతాప సభ

పాతమంచిర్యాల: భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య సభ్యులు కోడి రాములు ఈ నెల 17న రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో జిల్లా కేంద్రంలో అరుణోదయ సాంస్కృతిక స మాఖ్య సభ్యులు సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘ టించారు. కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కోశాధికారి మంతెన మల్లన్న, జిల్లా కార్యదర్శి ఎం.జ్యోతి, నాయకులు పాల్గొన్నారు.

భారీ వాహనాల నిషేధాన్ని ఎత్తివేయండి

జన్నారం: టైగర్‌జోన్ పేరున జన్నారం నుంచి భారీ వాహనాల రాకపోకలను నిషేధించారని, దీంతో జన్నారం మండల మార్కెట్ పడిపోయిందని, ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి భారీ వాహనా ల రాకపోకల నిషేధాన్ని ఎత్తివేసేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివా రం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు జన్నారం మండలానికి చెందిన పలు వురు నాయకులు ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జన్నారం మండలానికి చెందిన పలువురు నాయకులు మాట్లాడుతూ.. భారీ వాహనాల నిషేధం వల్ల వ్యాపారులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చిన ట్లు వారు తెలిపారు. నా యకులు కొండపల్లి మహేశ్, పరశురాం ఉన్నారు.

మరమ్మతులు చేపట్టరూ..!

- కల్వర్టు వద్ద కోతకు గురైన అప్రోచ్‌లు
- ప్రమాదం అంచున ప్రయాణాలు
- మూడేళ్లుగా అదే స్థితి
- నిధులు మంజూరైనా నిర్మాణాల్లో జాప్యం


లెండిగూడ వద్ద..


వెల్గీ రహదారిపై కోతకు గురైన కల్వర్టు

వాంకిడి: గతంలో కురిసిన భారీ వర్షాలకు ఒర్రెలు, వాగులు ఉప్పొంగి మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులు, వంతెనలు, కల్వర్టులు ధ్వంసమయ్యాయి. మూడేళ్లు గడిచినా మరమ్మతులకు నోచుకోకపోవడంతో మండలవాసులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రహదారుల మరమ్మతులకు గతేడాది నిధులు మంజూరైనప్పటికీ టెండర్ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. మళ్లీ వానాకాలంలో భారీ వర్షాలు కురిస్తే ఉన్న సగం రోడ్లు కూడా కోతకు గురయ్యే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా అప్రోచ్‌లు..

మండల కేంద్రం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే లింక్ రోడ్లపై నిర్మించిన కల్వర్టులు వరదల ధాటికి కోతకు గురయ్యాయి. మూడేళ్లుగా ప్రజలు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని ప్రయాణాలు సాగిస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇందాని గ్రామానికి వెళ్లే రహదారిపై లెండిగూడ గ్రామ సమీపంలో ఒర్రెపై నిర్మించిన కల్వర్టు అప్రోచ్ రోడ్డు సగం వరకు కోతకు గురైంది. వెల్గీ, లక్ష్మీపూర్, పాతగూడ జీపీలోని ఎనోలి, బంబార జీపీలోని రాజునగర్, సవాతి ధాబా, జైత్‌పూర్, బోర్దా, లంజన్వీర, సరాండి గ్రామాలకు వెళ్లే రహదారులపై ఉన్న కల్వర్టు అప్రోచ్‌లు వరదలకు భారీగా కోతకు గురయ్యాయి. వరదలు వచ్చిన సమయంలో అధికారులు, నాయకులు సంఘటన ప్రాంతాలను సందర్శించి కొన్ని చోట్ల తాత్కాలికంగా మట్టితో మరమ్మతులు చేయించి చేతులు దులుపుకున్నారు. వరదలు వచ్చిన ప్రతీసారి మట్టితో చేపట్టిన పనులు కోతకు గురవ్వడం మళ్లీ తాత్కాలిక పనులు చేపట్టడంతోనే సరిపెట్టుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేలా అధికారులు దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపాలని, బీటీ, సిమెంట్‌తో మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిధులు మంజూరై ఏడాది..

మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులపై కోతకు గురైన కల్వర్టు అప్రోచ్‌ల మరమ్మతులకు గతేడాది ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగా నేటికీ పనులు ప్రారంభం కాలేదు. ఇందాని జీపీ పరిధిలో గల లెండిగూడ సమీపంలో కోతకు గురైన కల్వర్టుకు రూ.25 లక్షలు, పాతగూడ జీపీలోని ఎనోలి రహదారిపై రెండు ప్రాంతాల్లో మరమ్మతులకు రూ.50 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. బంబార జీపీలోని రాజుగూడ రహదారిపై మరమ్మతులకు రూ.50 లక్షలు పంచాయత్ రాజ్ శాఖ నిధులు మంజూరు చేసింది. నిధులు మంజూరై ఏడాది కావస్తున్నా పనులు మాత్రం ప్రారంభానికి నోచుకోవడం లేదు. నిధులు మంజూరైన కల్వర్టుల మరమ్మతులు త్వరగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ ఏఈ స్టీవెన్ తెలిపారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు..



మూడేళ్ల క్రితం వచ్చిన వరదలకు కల్వర్టు అప్రోచ్ భారీగా కోతకు గురైంది. అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించి వెళ్లిపోతున్నారు. కానీ మరమ్మతులు మాత్రం చేపట్టడం లేదు. కొత్త వ్యక్తులు ఎవరైనా వస్తే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

– గుర్నులె మారుతి, ఇందాని

భయంగా ప్రయాణాలు సాగిస్తున్నాం



మా గ్రామానికి వెళ్లే రహదారిపై ఉన్న కల్వర్టు అప్రోచ్ వరదల ధాటికి కొట్టుకుపోయింది. దీంతో భారీ గుంత ఏర్పడింది. మూడేళ్లుగా పరిస్థితి అలాగే ఉంది. పశువులు రాత్రి వేళల్లో గుంతలో పడిన సంఘటనలు ఉన్నాయి. వాహనాలు కొంచెం అదుపు తప్పినా ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

– ఆదె సురేశ్, లెండిగూడ

పంటల రక్షణకు సోలార్ కంచె


పంట పొలంలో ఏర్పాటు చేసిన సోలార్ సెట్

- తక్కువ పెట్టుబడితో రక్షణ
- ఆసక్తి చూపుతున్న రైతులు

పెంచికల్‌పేట్: రైతులు సాగు చేస్తున్న పంటలను అడవి జంతువులు, పశువుల నుంచి రక్షించుకోవడానికి సోలార్ కంచె వినియోగిస్తున్నారు. గతంలో పంటలను కాపాడుకోవడానికి అన్నదాతలు పగలు, రాత్రి తేడా లేకుండా నిద్రాహారాలు మాని నిత్యం పంట పొలాల్లోనే కాలం గడిపేవారు. అయితే సోలార్ కంచెతో అడవి జంతువులతో పాటు మనుషులకు కూడా ఎలాంటి ప్రమాదం లేక పోవడంతో సోలార్ కంచె వినియోగం పెరుగుతోంది.

మండలంలో...

మండలంలోని మురళీగూడ, జిల్లెడ, నందిగామ, కమ్మర్‌గాం, గుండెపల్లి, అగర్‌గూడ, కొండపల్లి, కోయచిచ్చాల, ఎల్లూర్, బొంబాయిగూడ, లోడుపల్లి గ్రామాలు అటవీ సమీపంలో ఉన్నాయి. రైతులు సాగు చేస్తున్న వరి, పత్తి, సోయా, కంది, శనగ, మొక్కజొన్న, ఇతర పంటలు నిత్యం అడవి పందులు, వన్యప్రాణులు, కోతుల దాడుల్లో దెబ్బతింటున్నాయి. దీంతో పంటలు కాపాడుకోవడానికి అన్నదాతలు సోలార్ కంచె ఏర్పాటు చేస్తున్నారు.

తక్కువ ఖర్చు..

2 నుంచి 20 ఎకరాలు సాగు చేస్తున్న రైతులు సైతం సోలార్ కంచెను ఏర్పాటు చేస్తున్నారు. మార్కెట్‌లో రూ. 8వేల నుంచి రూ.20వేల వరకు పెట్టుబడితో రైతులకు కావాల్సిన పరికరాలు అందుబాటులో ఉంటున్నాయి. కర్రలు, జీఏవైర్, ఇన్సులేటర్, సోలార్ ప్యానెల్, బ్యాటరీలు వినియోగించి చేను చుట్టూ కంచెను ఏర్పాటు చేస్తున్నారు. కంచెకు నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యే వెసులుబాటు ఉండటంతో రైతులు పగలు, రాత్రి పంటలకు కంచెను ఏర్పాటు చేస్తున్నారు. బ్యాటరీ నుంచి వచ్చే డీసీ విద్యుత్‌తో జంతువులు కంచెను తగిలితే స్వల్పంగా షాక్ తగులుతుండటంతో వన్యప్రాణులు బెదిరిపోతున్నాయి. సోలార్ కంచెతో వన్యప్రాణులకు ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో రైతులు సోలార్ కంచె ఏర్పాటు చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు.

కాపలా ఉండాల్సిన అవసరం లేదు



మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాను. రూ.12వేల పెట్టుబడితో పంట చేను చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశాను. 24 గంటలు కంచెకు విద్యుత్ సరఫరా ఉంటుంది. కంచెకు జంతువులు తగిలితే షాక్‌కు గురై బెదిరిపోతాయి. గతంలో మాదిరి పగలు, రాత్రి పంటలకు కాపలా ఉండాల్సిన అవసరం లేదు. సోలార్ కంచెతో ఎంతో మేలు జరుగుతుంది.

– బండి శివలింగు, రైతు, గొంట్లపేట్

వైద్యులు కావలెను..!


కౌటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- కౌటాలలో ఖాళీగా వైద్యుడి పోస్టు
- వైద్యం అందక ప్రజలకు ఇబ్బందులు
- వచ్చీరాని వైద్యం చేస్తున్న ఆర్‌ఎంపీలు
- పట్టించుకోని వైద్యశాఖ అధికారులు


కౌటాల పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న వైద్యుడి కుర్చీ

కౌటాల: జిల్లాలోని పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)లలో సరిపడా సిబ్బంది లేక పల్లె ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అందుబాటులో ఉన్న ఏఎన్‌ఎంలు రోగులను చూసి మందులు రాసిస్తున్నారు. పరిస్థితి ఏ మాత్రం అటుఇటుగా ఉన్నా పట్టణ ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారు. సర్కారు ఆసుపత్రుల్లో పరీక్షలు చేసే విలువైన యంత్రాలు ఉన్నప్పటికీ సిబ్బంది లేక అలంకారప్రాయంగా మారుతున్నాయి.

అందని వైద్యం..

జిల్లాలో ఆసిఫాబాద్, సిర్పూర్(టి)లతో పాటు తిర్యాణి, జైనూర్, కాగజ్‌నగర్, బెజ్జూర్‌లలో సీహెచ్‌సీ (సామాజిక ఆరోగ్య కేంద్రం)లు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 20 పీహెచ్‌సీలు కూడా ఉన్నాయి. కొన్ని పీహెచ్‌సీల్లో వైద్య పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చాలా ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది సమయపాలన సరిగా పాటించడం లేదనే విమర్శలు సైతం విన్పిస్తున్నాయి. ఏఎన్‌ఎంలు, స్టాఫ్ నర్సులే పెద్ద దిక్కుగా మారి రోగులకు చికిత్స అందిస్తున్నారు. కౌటాల పీహెచ్‌సీకి కౌటాల మండలంతో పాటు సిర్పూర్(టి), చింతలమానెపల్లి మండలాల నుంచి ప్రతీరోజు రోగులు వస్తుంటారు. కానీ వైద్యులు లేకపోవడంతో బాధితులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

డెలివరీల్లో టాప్

కౌటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు లేకపోయినా స్టాఫ్ నర్సులే అన్నీ తామై వైద్యం చేస్తున్నారు. ఆయా సమీప మండలాలకు కౌటాల పీహెచ్‌సీయే దిక్కు. ఇక్కడ రెగ్యులర్‌గా విధులు నిర్వహించిన వైద్యురాలు గతేడాది ఉన్నత చదువుల కోసం వెళ్లిపోవడంతో అధికారులు పలువురి వైద్యులకు కౌటాల పీహెచ్‌సీ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటేషన్లపై ఉన్న వారు తమ సొంత పీహెచ్‌సీలకు వెళ్లాలని ఆదేశించడంతో కౌటాల పీహెచ్‌సీలోని వైద్యురాలు పెంచికల్‌పేట్‌కు వెళ్లారు. దీంతో కౌటాల పీహెచ్‌సీకి వైద్యుడు లేకుండా పోయారు. కౌటాల పీహెచ్‌సీకి నిత్యం 70 నుంచి 100 వరకు ఓపీ వస్తున్నారు. దీంతో వైద్యులు సక్రమంగా రాని పరిస్థితుల్లో స్టాఫ్ నర్సులే చికిత్స అందిస్తున్నారు. కౌటాల పీహెచ్‌సీలో నెలకు 60 నుంచి 70 వరకు సాధారణ ప్రసవాలు చేస్తుంటారు. సాధారణ కాన్పులు అధికంగా చేయడంలో ఈ పీహెచ్‌సీకి రాష్ట్రంలోనే మంచి గుర్తింపు ఉంది. పీహెచ్‌సీలో వైద్యులతో పాటు ల్యాబ్ టెక్నీషియన్ సైతం లేరు. దీంతో రక్త పరీక్షలు చేయలేని పరిస్థితి ఉంది.

వచ్చీరాని వైద్యం..

కౌటాల పీహెచ్‌సీలో వైద్యుడు లేకపోవడంతో అమాయక ప్రజలు వైద్యం కోసం ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా వచ్చీరాని వైద్యంతో రోగులకు వారు వైద్యం చేస్తున్నారు. ఆర్‌ఎంపీల వైద్యం కారణంగా జిల్లాలో పలువురు మృతి చెందిన సంఘటనలు సైతం ఉన్నాయి. రోగులకు ప్రథమ చికిత్స అందించి పెద్దాస్పత్రులకు పంపాల్సిన ఆర్‌ఎంపీలు హద్దులు దాటి వైద్యం చేస్తున్నారు. అదేకాకుండా మండల కేంద్రాల్లో ఇష్టానుసారంగా ల్యాబ్‌లను ఏర్పాటు చేసి రక్తపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇళ్ల వద్దే ప్రజలకు ఆర్‌ఎంపీలు వైద్యం అందిస్తున్నా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విషయం పై జిల్లా వైద్యశాఖ అధికారులను సంప్రదించగా స్పందించలేదు.

వైద్యుడిని నియమించాలి



కౌటాల పీహెచ్‌సీకి వైద్యుడు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పీహెచ్‌సీకి ప్రతి రోజు చాలా మంది రోగులు వస్తారు. కానీ వైద్యుడు లేకపోవడంతో స్టాఫ్ నర్సులే వైద్యం చేస్తున్నారు. వైద్యుడి లేని కారణంగా కొంత మంది ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ఆర్‌ఎంపీలు వచ్చీరాని వైద్యం చేస్తూ ప్రజల నుంచి డబ్బులు దండుకుంటున్నారు. కౌటాల పీహెచ్‌సీకి వెంటనే వైద్యుడిని నియమించాలి.

– తిరుపతి, కౌటాల

కంటి వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై విక్రమ్

బెజ్జూర్: తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్సై విక్రమ్ అన్నారు. మండల కేంద్రంలో స్వర్గీయ కొండ్ర హనుమ గౌడ్- బుచ్చమ్మల జ్ఞాపకార్థం మంచిర్యాల న్యూ పవన్ ఆప్టికల్స్ కంటి ఆస్పత్రి సహకారంతో వారి కుమారులు ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా జావిద్, కొండ్ర మనోహర్ గౌడ్, జగ్గా గౌడ్, సురేశ్ గౌడ్, నరేందర్ గౌడ్, తాజొద్దీన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జీవస్వరం కూటములు


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కౌటాల: మండల కేంద్రంలోని ఇన్‌ఫంట్ జీసస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఆవరణలో గత మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న జీవస్వరం సువార్త స్వస్థత కూటములు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బిషప్ ప్రిన్స్ ఆంతోని మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు దేవుని పట్ల భయభక్తులు కలిగి ఉండాలన్నారు. పాఠశాల మైదానంలో భక్తుల సందడి నెలకొంది. కూటముల్లో ఫాదర్లు టోమ్, సీజో, సతీష్, బైజో తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం.. పరిహాసం



దహెగాం: గ్రామాల్లో వ్యాధుల నివారణకు ప్రభుత్వం ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించింది. కానీ పలు గ్రామాల్లో రోడ్లపైనే మురుగు నీరు పారుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఇట్యాల గ్రామంలో ప్రధాన రహదారిపై మురుగు నీరు పారుతుండడంతో ప్రయాణికులు ఇదేనా పారిశుధ్యం అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మురుగు నీరు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కనుల పండువగా రథోత్సవం


రథోత్సవంలో భక్తులు

జన్నారం: మండలంలోని కలమడుగు శ్రీ నరనారాయణ స్వామి 39వ వార్షికోత్సవం పురస్కరించుకుని నిర్వహిస్తున్న జాతరలో భాగంగా ఆదివారం మూడో రోజు రథోత్సవం జరిగింది. ఉదయం భక్తులు నరనారాయణ స్వామి, ఆంజనేయస్వామి దేవతా మూర్తులకు అభిషేకం పూజలు జరిపారు. అనంతరం సాయంకాలం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాలను, రథాన్ని అలంకరించి, ఆలయ పరిసరాల్లో రథాన్ని తిప్పారు. భక్తుల జయజయ ధ్వనుల మధ్య, నమోనారాయణ నామ స్మరణతో భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. పూజారులు కాకర నర్సయ్య, రాజనరేంద్రశర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్‌కుమార్, సభ్యులు కిషన్‌గౌడ్, అంజగౌడ్, శంకరయ్య, విష్ణుమూర్తి, మల్లేశ్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపర్చండి

చెన్నూర్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను మెరుగు పర్చాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాస్‌రావు అన్నారు. స్థానిక శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యా వ్యవస్థ భ్రష్టుపట్టి పోయిందన్నారు. కులానికి ఒక్క గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసి సొంత భవనాలు నిర్మించలేదని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మండలానికో ఇంటర్నేషనల్ పాఠశాల నిర్మాణం కోసం రూ.2500కోట్లు కేటాయించిందన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చెన్నూర్: మండలంలోని కత్తెరశాల, అంగ్రాజుపల్లి గ్రామాల మధ్య శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓత్కులపల్లి గ్రామానికి చెందిన కంకణాల దేవేందర్‌రెడ్డి(40), చెన్నూర్ పట్టణంలోని లైన్‌గడ్డకు చెందిన సైఫ్ అనే యువకుడు మృతి చెందారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, మా జీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలుతో కలిసి పార్థివ దేహాలను సందర్శించి పూల మాలలు సమర్పించారు. మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా:
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.పోచయ్యకుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899